'కౌలు' కష్టం తీరేనా?



- రైతు భరోసాపై కౌలు రైతుల ఆశలు
- పెరుగుతున్న కౌలు ధరలు
- పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులే దిక్కు
- పట్టాదారులకే పరిమితమైన పథకాలు
- సాగులో సగంపైగా కౌలు రైతులే
- ఎకరానికి రూ 15 వేల నుంచి రూ 18 వేల వరకు కౌలు ధరలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పొద్దంతా ఎవుసంతోనే కష్టపడుతున్నా కౌలు రైతుల జీవనం అగమ్య గోచరంగానే కొనసాగుతోంది. భూతల్లిని నమ్ముకొని బతుకుతున్న కౌలు రైతులకు యేటా పెరుగుతున్న కౌలు ధరలకు తోడుగా పంటలకు తెచ్చిన అప్పుల వడ్డీ భారంగానే మారుతోంది. గత ప్రభుత్వం రైతు బంధు ప్రయోజనం కేవలం పట్టాదారులకు మాత్రమే కల్పించింది. బ్యాంక్ రుణాలు కూడా పట్టాదారులకే ఇచ్చే అవకాశం ఉండడంతో కౌలు రైతులు పెట్టుబడులకు వడ్డీ వ్యాపారుల దిక్కు చూసేవారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు 80 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ప్రతీసారి వానాకాలం, యాసంగి సీజన్‌లకు కలిపి కౌలు ధరలు నిర్ణయించుకుంటారు.

కొన్ని చోట్ల సీజన్ల వారీగా కౌలు ధరలు ఉన్నాయి. ప్రతియేటా కౌలు ధరలు పెరుగుతుండడంతో అందోళన చెందుతున్న కౌలు రైతులకు కొత్త ప్రభుత్వం రైతు భరోసా పేరిట రైతులతో పాటు కౌలు దారులకు కూడా సాయం అందించడానికి హామీ ఇచ్చింది. రైతులకు యేటా ఎకరానికి రూ 15 వేలు, వ్యవసాయ కౌలు దారులకు రూ 12 వేల చొప్పున సాయం అందించనుంది. వరి పంటకు బోనస్‌గా రూ 500 ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో కౌలు రైతులు కొంత ఊరట లభిస్తుందని భావిస్తున్నారు.

కౌలు ధరలతో అయోమయం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాళేశ్వరం జలాలతో పాటు 24 గంటల కరెంట్, మిడ్ మానేరు, అనంతారం ప్రాజెక్టులతో పాటు చెరువుల్లోకి ఎత్తిపోతలతో నీళ్ల నింపడం దీనికి తోడుగా వర్షాలు కూడా ఆశా జనకంగానే ఉన్నా గత వానాకాలం సీజన్‌లో కౌలు ధరలు మాత్రం భారీగానే పెంచారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2.50 లక్షల నుంచి 2.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1.75 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు.

జిల్లాలోని ప్రాంతాలను బట్టి కూడా కౌలు ధరలు, ఒప్పందాలు మారు తున్నాయి. పత్తి ఒకే పంట వస్తుండడంతో ఒకే రేటు ఉండగా వరి, ఇతర పంటలకు సంబంధించి వానాకాలం, యాసంగి పంటకు కలిపి కూడా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఎకరానికి నీటి వసతి తక్కువగా ఉంటే ఎనిమిది వేల రూపాయల నుంచి 10 వేల రూపాయల వరకు, సమృద్ధిగా నీటి వసతి ఉంటే 14వేల రూపాయల నుంచి 18 వేల రూపాయల వరకు కౌలు ధర ఉంటుంది. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు, 171 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఐదు లక్షల ఎకరాల వరకు సాగు భూములు ఉన్నా సీజన్‌ను బట్టి రెండు లక్షల పైచిలుకు ఎకరాల్లోనే సాగు జరుగుతోంది. జిల్లాలో ఒక ఎకరంలోపు సాగు భూములు ఉన్నవారు 79,354 మంది ఉన్నారు. వీరు తోటి రైతుల వద్ద మరో రెండు నుంచి ఐదెకరాల వరకు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరితో పాటు మరో 15 వేల మంది ఎలాంటి భూములు లేకపోవడంతో కౌలు భూములపైనే ఆధారపడుతున్నారు.

రైతు బంధు వచ్చినా తగ్గని కౌలు ధరలు

కౌలు రైతులకు గత ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందలేదు. గతంలో జిల్లా వ్యాప్తంగా రుణ అర్హత కార్డులు ఇచ్చారు. ప్రస్తుతం కార్డులు దూరమయ్యాయి. పట్టాదారులకు రైతు బంధు ద్వారా ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. జిల్లాలో గత వానాకాలం సీజన్‌లో 1,27,249మంది రైతులకు రూ 129.83 కోట్లు అందించారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1,34,725 మంది రైతులకు రూ 132.50 కోట్లు వరకు జమ కానున్నాయి. రైతు బంధు సాయం అందుతున్నా రైతులు కౌలు ధరలు మాత్రం తగ్గించడం లేదు.

పకృతి వైపరీత్యాలతో నష్టం...

కౌలు రైతులకు ఎలాంటి గుర్తింపుపత్రాలు లేకపోవడంతో వడ్డీ వ్యాపారుల వద్దనే అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో పకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న సంఘటనలు ఉన్నాయి. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో కౌలు తీసుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. కనీసం పకృతి వైపరీత్యాలతో నష్టం జరిగినప్పుడు కనీసం పరిహారం కూడా అందుకోలేని పరిస్థితుల్లో కౌలు రైతులు చితికిపోతున్నారు. కౌలు రైతులను కూడా ఆదుకోవాలని ప్రజాసంఘాలు ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేకుండా ఉంది.

యాసంగిలో 1.82 లక్షల ఎకరాల్లో సాగు అంచనా...

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో వ్యవసాయ శాఖకు సంబంధించి 1.75 లక్షల ఎకరాలు, ఉద్యానవన శాఖకు సంబంధించి 6,317 ఎకరాల్లో సాగు చేయనున్నారు. యాసంగిలో వరి 1.73 లక్షల ఎకరాల్లో సాగుకు సిద్ధమయ్యారు.

ఇప్పటికే యాసంగి వరినాట్లలో లక్ష ఎకరాలు దాటింది. యాసంగి సాగులో బోయినపల్లి మండలంలో 13,630 ఎకరాలు, చందుర్తిలో 15,605 ఎకరాలు, గంభీరావుపేటలో 17,510 ఎకరాలు, ఇల్లంతకుంటలో 24,925 ఎకరాలు, కోనరావుపేటలో 17,500 ఎకరాలు, ముస్తాబాద్‌లో 20,550 ఎకరాలు, రుద్రంగిలో 4,000 ఎకరాలు, సిరిసిల్ల 3,205 ఎకరాలు, తంగళ్లపల్లి 18,625 ఎకరాలు, వేములవాడ రూరల్ 10,283 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 16,900 ఎకరాలు, వీర్నపల్లిలో 6,700 ఎకరాల్లో సాగు చేయనున్నారు. వీటితో పాటు జిల్లాలో మొక్కజొన్న 1,014 ఎకరాలు, వేరుశెనగ 65 ఎకరాలు, నువ్వులు 245 ఎకరాలు, పొద్దు తిరుగుడు 303 ఎకరాలు, శెనగలు 392 ఎకరాలు, ఇతర పంటలు 221 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

వేములవాడ, జనవరి 18: వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. జిల్లా నూతన రిజిస్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన తొలుత వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వినియోగదారుడికి అందించే సేవల్లో ఎలాంటి లోపం ఉండొద్దని అన్నారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట స్థానిక సబ్ రిజిస్ట్రార్ చెర్ల సురేంద్రబాబు, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి: ఎస్పీ



పట్టుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట, జనవరి 18: పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ ట్రైనింగ్ ఐపీఎస్ అధికారి రాహుల్ రెడ్డితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని కేసుల వివరాలను, రికార్డులను సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుకున్న పోలీస్‌స్టేషన్‌లోని వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. డయల్ 100కు ఫోన్ రాగానే వెంటనే స్పందించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలపై వెంటనే స్పందించి న్యాయం చేయాలని అన్నారు. సైబర్ నేరాలపై యువతను అప్రమత్తం చేయాలని అన్నారు. ఆయన వెంట చందుర్తి సీఐ కిరణ్ కుమార్, ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

విద్యుత్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జనవరి 18: విద్యుత్ సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో భాగంగానే ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలకు ఇద్దరు ఏఈలను కేటాయించామని సెస్ సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు పాత పద్ధతిలోనే సెస్ సేవలు అందిస్తామని అన్నారు. ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తం 42 గ్రామాల్లో 32వేల విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని అన్నారు. సేవలను సులభతరం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు ఏఈలను నియమించామన్నారు. ఎల్లారెడ్డిపేటలో 24 గ్రామాల్లో 22వేల విద్యుత్తు కనెక్షన్లు, వీర్నపల్లిలో 18 గ్రామాల్లో 10 వేల కనెక్షన్లుగా విభజించామని పేర్కొన్నారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. నాణ్యమైన విద్యుతుతో పాటు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని డీఈ శ్రీనివాస్ అన్నారు. ఆయన వెంట ఏడీ మహేందర్, నాయకులు బాల్‌రెడ్డి, సీత్యానాయక్ తదితరులు ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట, జనవరి 18: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు హరిదాస్‌నగర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలోని ఎఫ్ఎల్ఎం రికార్డు, పిల్లల పాఠ్య పుస్తకాలను సరిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పాఠ్యాంశాలల్లో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతీ నెల మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను విధిగా నిర్వహించి నివేదికలను జిల్లా కేంద్రానికి సమర్పించాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని నేరుగా తెలుసుకున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులను డీఈవో ఆదేశించారు. ఆయన వెంట హెచ్ఎంలు హన్మండ్లు, కుబేరస్వామి, రామచంద్రం ఉన్నారు.

విద్యార్థినులకు అభినందన

ఎల్లారెడ్డిపేట, జనవరి 18: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ నెల 12న వేములవాడ మండలం శాత్రాజపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి మొదటి స్థానం సంపాదించారు. ఐదు వేల నగదు ప్రోత్సాహకంతో పాటు ట్రోఫీని అందుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీధర్, పీఈటీ అనిల్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్‌గా నమోదు చేయాలి

- ఆర్డీవో అనంద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, జనవరి 18: అర్హులను ఓటర్‌గా గుర్తించి వారిపేర్లను నమోదు చేయాల్సిన బాధ్యతను బీఎల్‌వోలు నిర్వహించాలని సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆర్డీవో ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్‌కు ఓటర్ల గుర్తింపు, గుర్తింపు కార్డులో చేర్పులు, మార్పులు, తొలగింపులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటు చాలా విలువైందన్నారు. ఓటర్ల గుర్తింపు, గుర్తింపుకార్డులో చేర్పులు, మార్పులు, తొలగింపులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అయాజ్, తహసీల్దార్ షేరీపొద్దిన్, సీడీపీవో అలేఖ్య, మున్సిపల్ మేనేజర్ మీర్జా ఫసమాత్‌అలీబేగ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటరు నమోదు చేయాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు.

వీర్నపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతీ గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సమన్వయంతో ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యద ర్శులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

నేతన్నలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 18: నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్లలో టెక్స్‌టైల్ పరిశ్రమ సమ్మెపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాయడంపై ఆయన స్పందిస్తూ బండి సంజయ్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. 2004 సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్ తీసుకొచ్చి పరిశ్రమలు నెలకొల్పే విధంగా చేసి వస్త్ర పరిశ్రమలు అభివృద్ధి పరిచింది కాంగ్రెస్ పార్టీ అని, అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం నిర్లక్ష్యంతో అనేక మంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. 2004లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి నేత కార్మికుల ఆత్మహత్యలను గుర్తించి సిరిసిల్లకు ప్రత్యేకమైన ప్యాకేజ్ అందించారని, ఆత్మహత్య చేసుకున్న కార్మికులకు 1,50,000 ఎక్స్‌గ్రేషియా, 50 సంవత్సరాలకే నేతన్నకు పెన్షన్, 50 శాతం పవర్ సబ్సిడీ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. సిరిసిల్లకు ప్రత్యేకమైన ప్యాకేజ్ ద్వారా మహిళా గ్రూపులకు ఐదు లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు, రాజీవ్ విద్యా మిషన్ ద్వారా వస్త్రాన్ని తయారుచేసే ఆర్డర్‌ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇచ్చారన్నారు. తెలంగాణలోనే మొట్టమొదటి టెక్స్‌టైల్ పార్కును తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎంపీ బండి సంజయ్ ఇప్పటివరకు వస్త్ర పరిశ్రమ కోసం కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, బండి సంజయ్ ముఖ్యమంత్రికి లేఖ రాయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. సిరిసిల్ల నేతన్నల కోసం 13 వేల అంత్యోదయ కార్డులను అందజేయడమే కాకుండా రాజీవ్ విద్యా మిషన్ ద్వారా పాలిస్టర్ పరిశ్రమ ఏర్పాటు కృషి చేశామన్నారు. గత ప్రభుత్వం చెల్లించని బిల్లులను కూడా చెల్లించేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 20 వేల మంది కార్మికులు ఉన్న ఈ ప్రాంతం నుంచి వినోద్ కుమార్, బండి సంజయ్ కలిసి కాకతీయ టెక్స్‌టైల్‌ను వరంగల్ కు తరలించిందినది మీరు కాదా, జీఎస్టీ పేరుతో నేతన్నలపై భారము మోపుతుంది కేంద్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. 45 రోజులు కూడా గడవని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చేతనైతే వస్త్ర పరిశ్రమ మీద ఉన్న జీఎస్టీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కొంత మందికి మాత్రమే లబ్ది జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం ఆలోచనలో చేస్తున్నదన్నారు. కార్మికుడే ఓనర్ అయ్యే పథకాన్ని తీసుకువస్తామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు చిలుక రమేష్, పులి రాంబాబు, వంగల శ్రీనివాస్, ముంజ ఉమేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వసతిగృహాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 18: వసతి గృహాల్లో పరిశుభ్రతతో పాటు విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టిని సారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల పట్టణం గీతనగర్‌లోని ప్రభుత్వ బాలికల బీసీ వసతి గృహాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదులు, మరుగుదోడ్లలలో పరిశుభ్రతను పరిశీలించారు. స్టోర్‌రూంతోపాటు స్టాక్ రిజిస్టర్లను పర్యవేక్షించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గీజర్ సౌకర్యం ఉందా, మినరల్ వాటర్ అందుబాటులో ఉన్నాయ అని దుప్పట్లు, యూనిఫాంలను అందించారా.. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు హాస్టల్‌కు పేయింట్ వేయించాలని స్పెషల్ ఆఫీసర్, లేబర్ అధికారి రఫీని ఆదేశించారు, ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుతోపాటు మ్యాట్, ఇతర మౌలిక వసతుల సదుపాయాలపై ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపాలని సూచించారు. ప్రస్తుతం హాస్టల్‌లో 55మంది విద్యార్థినులు ఉన్నందున వీరి సంఖ్యను వందకు పెంచాలని ఆదేశించారు.

- సిరిసిల్ల వసతిగృహ వార్డెన్‌పై వేటు..

సిరిసిల్ల పట్టణం గీతనగర్‌లోని బాలికల బీసీ వసతి గృహాన్ని కలెక్టర్ అనురాగ్‌జయంతి తనిఖీ చేస్తున్న సమయంలో వార్డెన్ కళ్యాణి విధుల్లో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైన కళ్యాణిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమె స్థానంలో మరో మహిళా అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మైనార్టీ అధికారి బొద్దుల గంగయ్య, స్పెషల్ అఫీసర్ సర్వర్‌మియా, ప్రత్యేక అధికారులు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: అగ్రహారం డిప్లొమా బాలికల కళాశాల, తిప్పాపురం బీసీ బాలికల కళాశాల, వేములవాడలోని బాలుర మైనారిటీ పాఠశాల, బీసీ బాలుర హాస్టళ్లను గురువారం కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను, భోజన సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారులు, ఆయా హాస్టళ్ల అధికారులు ఉన్నారు.

వేములవాడ మున్సిపల్ కార్యాలయానికి

విద్యుత్ సరఫరా నిలిపివేత

జనరేటర్ ఉపయోగిస్తున్న అధికారులు



విద్యుత్ సరఫరా కోసం ఉపయోగిస్తున్న జనరేటర్

వేములవాడ, జనవరి 18: విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో వేములవాడ పురపాలక సంఘం కార్యాలయానికి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వేములవాడ మున్సిపాలిటీ తరఫున సుమారు రెండు కోట్ల అరవై లక్షల రూపాయలకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉండడంతో సెస్ విద్యుత్ సరఫరా సంస్థ అధికారులు రెండురోజుల కిందట మున్సిపల్ కార్యాలయా నికి విద్యుత్ సరఫరా కట్ చేశారు.

విద్యుత్ లేకపోవడంతో కార్యాలయంలో కంప్యూటర్లు, లైట్లు, ఫ్యాన్లు పనిచేయని పరిస్థితి ఏర్పడింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గం కింద రెండు రోజులుగా జనరేటర్ ఉపయోగిస్తూ పనులు చేయాల్సి వస్తోంది. సెస్ సంస్థకు సుమారు రెండు కోట్ల 60 లక్షల రూపాయల మేరకు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉందని, బకాయిలు చెల్లించాలని మున్సిపల్ అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయిందని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేశామని సెస్ అధికారి తెలిపారు. మొత్తం బకాయిలో కనీసం 25 నుంచి 30 శాతం చెల్లించాలని కోరినప్పటికీ మున్సిపల్ అధికారుల నుంచి స్పందన లేదని ఆయన వాపోయారు. విద్యుత్ బకాయిలు చెల్లించని కారణంగా మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేసిన వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

గ్రామపంచాయతీ నిధుల వివరాలు తెలపాలి

కోనరావుపేట, జనవరి 18: మండలంలోని మర్తనపేట గ్రామపంచాయతీ నిధులు ఖర్చుల వివరాలు తెలపాలని మర్తనపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతి గౌడ్‌తో పాటు ప్రజాప్రతినిధులు గురువారం ఎంపీడీవో రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు వచ్చిన నిధులు, ఖర్చయిన పనులు వివరాలు తెలపాలని కోరుతూ ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బొల్లారం తిరుపతి, మోత్కు మోహన్, చేపూరి అజయ్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలి

చందుర్తి, జనవరి 18 ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు లక్ష్మణ్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం మధ్యాహ్న భోజన నిర్వకులు వేతనాలు పెంచాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేస్తున్నారన్నారు. కోడిగుడ్డకు ప్రభుత్వం ఐదు రూపాయాలు చెల్లించగా మార్కెట్‌లో కోడిగుడ్డకు ఏడు రూపాయలు ఉందన్నారు. కోడిగుడ్డును ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఫిబ్రవరి 4న సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మశాలి కళ్యాణ భవనం వరకు నిర్వహించే ర్యాలీకి పెద్దఎత్తున మధ్యాహ్న భోజన నిర్వాహకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ, లక్ష్మి, రేణుక, లక్ష్మి, మల్లవ్వ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రభాకర్‌రావు

జగిత్యాలరూరల్, జనవరి 18: జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం, రాయికల్, బీర్‌పూర్, మెట్‌పల్లి మండలాల్లోని పలు చోట్ల కొన్నిరోజులుగా వ్యవసాయబావుల వద్ద విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూర్ గ్రామానికి చెందిన చిన్నమనేని మహేష్, బసగుట్ట నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ స్టేషన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఛిందితుల వివరాలను వెల్లడించారు. ఇటీవలి కాలంలో తరచుగా వ్యవసాయబావుల వద్ద వ్యవసాయ విద్యుత్ మోటార్లు దొంగతనం జరుగుతుండటంతో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, ఎస్సై సధాకర్ తో పాటు సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరస్థులను పట్టుకునే క్రమంలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. కారును తనిఖీ చేయగా అందులో నాలుగు విద్యుత్‌మోటార్లు, వాటికి సంబంధించిన పరికరాలు డిక్కీలో లభించినట్లు తెలిపారు. కారులో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల దొంగిలించిన వ్యవసాయవిద్యుత్ మోటార్లను విక్రయించడానికి వెళ్తున్నట్లు తెలిపారు. మరింత లోతుగా నేరస్థులను విచారించగా మరో 18 వ్యవసాయ విద్యుత్ మోటార్లను జిల్లా వ్యాప్తంగా దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, ఎస్సై సధాకర్‌లను అడిషనల్ ఎస్పీ అభినందించారు. కానిస్టేబుల్స్ నసీర్‌ఖాన్, శ్రీనివాస్, గంగాధర్ లకు రివార్డులను అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, విద్యుత్‌మోటార్లు

కాలువ గండికి మరమ్మతులు చేపట్టాలి

చొప్పదండి, జనవరి 18: మండలంలోని రుక్మాపూర్ శివారులోని డి-89 కాలువకు పడ్డ గండికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కాలువ గండిని పరిశీలించారు. అధికారులు వెంటనే గండిని పూడ్చాలని కోరారు.

ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్, జనవరి 18: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాల కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించ నున్నట్లు మండలంలోని అలుగునూర్ సీఓఈ ప్రిన్సిపాల్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్ క్రైం, జనవరి 18 : కరీంనగర్ జిల్లా జైలులో ఆహారపదార్థాలు, వస్తువులు, వివిధ రకాల స్టీల్ ఫర్నిచర్ తయారీ ముడిసరుకు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ జి సమ్మయ్య గురువారం ఒక ప్రటనలో తెలిపారు. 18వ తేదీ నుంచి టెండర్ దరఖాస్తులు జైలులో అందుబాటులో ఉంటాయని, 23న టెండర్లు తెరవబడుతా యన్నారు. వివరాలకు 9494632431 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

శ్రీరామపాదుకలకు ప్రత్యేక పూజలు



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, అధికారులు

వేములవాడ, జనవరి 18: అయోధ్యలోని బాల రాముడి ఆలయంలో అభిషేకం జరిపించి తీసుకువచ్చిన శ్రీరామపాదుకలకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని శ్రీరామ పీఠంకు చెందిన స్వామీజీ సురేష్ ఆత్మారాం రామదాసు నేతృత్వంలోని బృందం ఈనెల ఏడో తేదీన అయోధ్యలోని బాలరాముడి ఆలయంలో పాదుకలకు అభిషేకం జరిపించిన అనంతరం సూరజ్ ఖుండ్, భరత్ ఖుండ్ ప్రాంతాల్లోనూ ప్రత్యేక అభిషేకం జరిపించిన శ్రీరామపాదుకలను తలపై పెట్టుకుని పాదయాత్రగా బయలుదేరి 17వ తేదీన కొండగట్టు చేరుకున్నామని స్వామీజీ సురేష్ ఆత్మరామ్ రామదాసు తెలిపారు. శ్రీరామపాదుకలతో వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సౌత్ జోన్ క్రీడలకు ఎంపిక

కోనరావుపేట, జనవరి 18: ఖేలో ఇండియా ఉమెన్స్ సౌత్ జోన్ ఉషూ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొనన్నట్లు ఉషూ ఎన్ఐఎస్ కోచ్ అక్కెనపల్లి వినోద్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఉమెన్స్ లీగ్ పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తమిళనాడు వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించను న్నట్లు తెలిపారు. పసుల జెస్సిక 39 కేజీల విభాగంలో, నూకల సుదీప్తి 33 కిలోల విభాగంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా డీవైఎస్‌వో రాందాస్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ దేవత ప్రభాకర్, అక్కినపల్లి వినోద్, ఎమ్.ప్రియాంక, డి.రోహిత్ అభినందించారు.

ఇద్దరు అనుమానితుల పట్టివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 18: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని లింగంపల్లి చంద్రయ్యకు చెందిన వ్యవసాయబావి వద్ద గురువారం కరెంటు మోటారును ఎత్తుకెలుతున్న ఇద్దరు అనుమానితులను గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తమ కరెంటు మోటారు ఎత్తుకెళ్లారని చట్టుపక్కల తిరుగుతుండగా ద్విచక్రవాహనంపై పెట్టుకొని వెలుతున్న అనుమానితులైన గంధం సతీష్, బూర తిరుపతిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని రైతు చంద్రయ్య తెలిపారు. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 18: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి టీపీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉపాధ్యాయుడు ఆరె రాకేష్‌రెడ్డి ఇంట్లో ఆవరణలో నిర్వహించన సమావేశం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భూపా లపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తారని తెలిపారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు మంచిరెడ్డి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

అగ్నిగుండాల్లో నడిచిన భక్తులు



అగ్ని గుండం నుంచి నడుస్తున్న భక్తులు


భీమదేవరపల్లి, జనవరి 18: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన అగ్ని గుండాల క్రతువు భక్తి పారవశ్యంతో సాగింది. గురువారం తెల్లవారు జామున కణకణ మండే అగ్నికణాల్లోంచి భక్తులు జై వీరభద్రా..శరభ.. శరభ.. అంటూ నడుచుకుంటు వెళ్లారు. ఈ కార్యక్రమం గంటకుపైగా కొనసాగింది. కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమం బంగీమఠం పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 4 గంటల ప్రాంతం నుంచి బంగీమఠం పరమేశ్వరయ్య పర్యవేక్షణలో అగ్ని గుండాల కార్యక్రమం కొనసాగింది. భద్రకాళి సమేత వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్ష యజ్ఞానికి ప్రతిరూపమైన అగ్నిగుండా కార్యక్రమానికి ముందుగా అగ్నిని ప్రతిష్ఠించారు. అగ్నిని శాంతింపచేసేందుకు స్వామివారి మూల మంత్రం జపించి అష్ట దిక్పాలకులను బంధించి ఆరాధన నిర్వహించారు. అగ్ని గుండాల్లో నడిచిన వారికి సుఖసంతోషాలతో ఉండడంతో పాటు శరీర బాధలు తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఎల్కతుర్తి కాగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి గ్రామ పర్యటన గురువారం రాత్రి జరిగింది. దీంతో జాతర బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్‌2 నోవు - మల్లాపూర్ | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ | టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మంత్రామాల్- అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్‌2 నోవు - మల్లాపూర్ | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ | టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మంత్రామాల్- అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్



ఒకే రోజు వేర్వేరు కేసుల్లో నాలుగు తీర్పులు

- దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 18: సిరిసిల్ల జూనియర్ సివిల్ కోర్టులో ఒకే రోజు నాలుగు తీర్పు వెలువరించారు. ఇందులో భాగంగా దాడి కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష , రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాషిక్యూషన్ వివరాల ప్రకారం... కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన రాస రాజు అదే గ్రామానికి చెందిన చల్ల రాజిరెడ్డికి రూ. 5వేల అప్పు ఇచ్చాడు. అప్పు ఇవ్వమని అడిగేందుకు ఆగస్టు 23, 2016న రాజిరెడ్డి వద్దకు వెళ్లిన బాధితుడి తండ్రి నారాయణరెడ్డిపై దాడి చేసి నెట్టివేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయగా రాజిరెడ్డిపై అప్పటి ఎస్ఐ రమేశ్‌నాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశాడు. ప్రాషిక్యూషన్ తరుపున పీపీ సందీప్ వాదించగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువుకావడంతో మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారని ఎస్ఐ అంజనేయులు తెలిపారు.

● చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు..

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష , రూ. 5వేల జరిమానా విధించారు. సిరిసిల్ల పట్టణంలో జనవరి 15, 2015న జరిగిన గంగమ్మ జాతరలో జాతరకు వెళ్లిన వీరవేణి లత మెడలో నుంచి నిందితుడు రెండున్నర పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదుచేసి గాలింపు చేపట్టగా అనుమానితుడైన అల్లెపు కృష్ణను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అల్లెపు కృష్ణపై నేరం రుజువుకావడంతో మెజిస్ట్రేట్ అతడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు.

● లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్ మడ్లోకర్ సంతోష్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 14,500 జరిమానా విధించారు. జిల్లెల్లకు చెందిన ఆటో సిరిసిల్లకు ప్రయాణికులతో వెలుతుండగా తంగళ్లపల్లి వద్ద సిద్దిపేట వైపు అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదుచేసి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అప్పటి సీఐ విజయ్‌కుమార్ విచారణ చేపట్టి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. మెజిస్ట్రేట్ నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 14,500 జరిమానా విధించారు.

● చీటింగ్ కేసులో మూడేళ్ల కఠిన శిక్ష

చీటింగ్ కేసులో నిందితుడైన సిరిసిల్లకు చెందిన కొండ రంజిత్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారు. సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన రామకృష్ణ ఆర్టీసీ కొరియర్‌లో ఔట్‌సోర్సింగ్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఇతను విధుల్లో ఉండగా సెప్టెంబరు 5, 2023న కొరియర్‌లో లాట్ మొబైల్స్ నుంచి పార్సిల్ వచ్చిందని తప్పుడు సమాచారం ఇచ్చి నమ్మించిన రంజిత్ ఆ పార్సిల్‌ను తీసుకెళ్లాడు. కొంతసేపటికే ఆ పార్సిల్ రంజిత్‌ది కాదని ఆర్టీసీ కొరియర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రామకృష్ణకు సమాచారం రావడంతో వెంటనే మోసపోయానని తెలుసుకొని అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు రంజిత్‌పై కేసు నమోదుచేసి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

మల్లాపూర్, జనవరి, 18 : మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివా రులో నిర్వహిస్తున్న కోళ్ల పందెం స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులోని షుగర్ ప్యాక్టరీ సమీపంలో కోళ్ల పందాలను నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో సీఐ లక్ష్మినారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న ఐదుగురితో పాటు మూడు కోళ్ళు, రు. 4500లు, వారి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పందెలాలో పాల్గొన్న మరి కొంత మంది పారిపోయినట్లు వారు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 : మండలంలో ఓ వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కోండ్రికర్ల గ్రామానికి చెందిన మెండే రవిపై అదే గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ ఈనెల 17న గ్రామంలో ఇనుప రాడుతో దాడికి పాల్పడడంతో రవి తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుడు తండ్రి మెండే చిన్నభూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ ఎక్స్‌రోడ్‌లో నిందితుడు ఆకుల శ్రీనివాస్‌ను పట్టుకొని అరెస్టు చేశామని చెప్పారు. దాడికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, ఇనుప రాడును స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జనవరి 18: మండలంలోని కట్కాపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో గురువారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7890 జప్తు చేసినట్లు వివరించారు. గ్రామాల్లో పేకాడుతున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో ఏడుగురికి జైలు.. జరిమానా

కరీంనగర్ క్రైం, జనవరి 18: కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 24 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఇందులో నుంచి ఇద్దరు వ్యక్తులకు పది రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు మొత్తం 14 వేల రూపాయలు జరిమానా విధించారని ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మిగతా 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతిరోజు కరీంనగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ ఉంటాయని ఒకవేళ మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని ఈ సందర్భంగా ఏసీపీ హెచ్చరించారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 30 మంది వ్యక్తులకు జైలు శిక్ష పడిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, అదేవిధంగా జైలు శిక్షకు గురి కావద్దని సూచిం చారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ చేసేందుకు ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి

- ఎంవీఐకి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

హుజూరాబాద్, జనవరి 18: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎంవీఐ ఠాకూర్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల బస్సుల ఫిట్నెస్‌తో పాటు డ్రైవర్ల లైసెన్స్‌లను తనిఖీ చేయాలన్నారు. దాదాపుగా 30 బస్సులకు పైగా ఉన్నాయని చెప్పారు. అందులో ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేసి ఆయా ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాము, వేణుగోపాల్, కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక ఎంపీ స్థానాలు గెలువాలి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

- మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- 28న నిర్వహించే అమిత్‌షా సమ్మేళనానికి తరలిరావాలి
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

సిరిసిల్ల రూరల్, జనవరి 18: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే తెలంగాణకు కేంద్రం నుంచి అదనపు నిధులు తీసుకొస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ పంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి బండి సంజయ్ హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేసిన విజయాలతోపాటు అందించిన నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కరీంనగర్‌లో ఈనెల 28న జరిగే సమ్మేళనానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వస్తున్నారని సభను విజయవంతం చేయాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని క్రియశీల కార్యకర్తలతో నిర్వహించే ఈ సమ్మేళనంలో ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలోని 20 మంది కార్యకర్తల చొప్పున పార్లమెంట్ పరిధిలో దాదాపు 40వేల మంది కార్యకర్తలు హాజరవుతారన్నారు. రాబోయో పార్లమెంట్ ఎన్నికలను పార్టీ నేతలకు సమాయత్తం చేయడమే లక్ష్యంగా సమావేశాలను నిర్వహిస్తామన్నారు.న రాబోయే ఎన్నికల్లో తమకు అప్పగించిన గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలను సమన్వయం చేయడంతోపాటు అత్యధిక ఓట్లు సాధించి గెలుపే లక్ష్యంగా చేసుకోని పనిచేయాలని కోరారు. కార్యకర్తల జోష్ చుశాక ఎంపీ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయపడుతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ సర్కార్ అనే విషయం అందరికి తెలుసన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి అత్యధిక ఎంపీలు గెలిస్తే తెలంగాణకు అదనపు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన తరువాత నియోజవర్గ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి 10వేల కోట్ల నిధులను తీసుకొచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చిందనే పూర్తివివరాలను వెల్లడించడంతోపాటు అతి త్వరలో గ్రామగ్రామాన ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నోళ్లు మూయిస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇంచార్జ్ గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బోమ్మ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, రాష్ట్ర నాయకులు మీసాల చంద్రయ్య, క్రిష్ణారెడ్డి, చెన్నమనేని వికాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బాస సత్యనారాయణ, బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

ధర్మపురిలో వేద పారాయణం..వేద హవనం ప్రారంభం

ధర్మపురి, జనవరి 18: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలు సుభిక్షంగా ఉండి, సుపరిపాలన అందించాలని ధర్మపురి శ్రీ మఠం పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామీజీ దివ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ శ్రీ ప్రేమిక వరద, వేదపరిపాలన సభ ఆధ్వర్యంలో ప్రముఖ ఘనాపాఠి కేదారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 21 మంది వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రుత్వికరణ, దీక్షాధారణ, ప్రత్యేక పూజలు, పారాయణాలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాలకు సహకారం అందించారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, దేవస్థానం మాజీ ఛైర్మన్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేద పారాయణం చేస్తున్న సిబ్బంది

ఎక్సైజ్‌టాస్క్‌ఫోర్స్ దాడుల్లో నాటు సారా పట్టివేత

కరీంనగర్ క్రైం/ఇల్లందకుంట, జనవరి 18: ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామ శివారులో గురువారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా 20 లీటర్ల నాటుసారా పట్టుబడింది. సిరిసేడు గ్రామానికి చెందిన దుగ్యాల పరమేశ్ వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. 375 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని తెలిపారు. నిందితుడు పరమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అల్పాహార విందులో జగిత్యాల వాసి

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, జనవరి 18: విదేశి పర్యటనలో ముఖ్యమంత్రి అల్పాహార విందులో జగిత్యాల వాసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తన తొలి అధికారిక విదేశీ పర్యటన కోసం దావోస్, స్విట్జర్లాండ్‌కు వెళ్లగా అక్కడ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి తెలుగు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన వారిలో జగిత్యాల పట్టణ వాసి ఒకరు ప్రముఖ పాత్ర వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్విట్జర్లాండ్ పర్యటన ముగించుకొని బయలుదేరక ముందు గురువారం ఉదయం ఎంపిక చేసిన కొందరు ప్రముఖులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అందులో మోహమ్మద్ ఇమ్రాన్ ఒకరు. ముఖ్యమంత్రి బృందం స్విస్‌కు వచ్చి తిరిగి వెళ్లే వరకు వెంటే ఉన్న స్థానిక తెలుగు వారిలో ఆయన కూడ ఉన్నారు.పట్టణంలోని ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన మోహమ్మద్ ఇమ్రాన్ కుటుంబ సమేతంగా స్విట్జర్లాండ్‌లో స్థిరపడ్డారు. ప్రపంచ ఆర్థిక రాజధానిగా భావించె జురిక్ నగరంలో నివసించె ఆయన తన మాతృభూమిను మరిచిపోలేదు. గల్ఫ్, స్వదేశం నుంచి స్విట్జర్లాండ్‌కు వచ్చే వారితో ఆత్మీయగా కలిసే ఆయన నగర భారతీయ ప్రముఖులలో ఒకరు. స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న జగిత్యాలకు చెందిన మంద భీంరెడ్డిని కూడా ఆయన సాదారంగా స్వాగతం పలికారు.

అనుమతులు లేకుండా ధర్నా చేసిన లారీ డ్రైవర్లపై కేసు నమోదు

హుజూరాబాద్, జనవరి 18: హుజూరాబాద్ పట్టణ శివారులో ఎలాంటి పోలీసుల అనుమతులు లేకుండా ధర్నా, రాస్తారోకో నిర్వహించినందుకు గాను పది మంది లారీ డ్రైవర్లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. హిట్ అండ్ రన్ పేరు మీద లారీ డ్రైవర్లు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందుకు వీరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసు నమోదైన వారిలో ఏ రవి, వి కోటేశ్వర్‌రావు, పి రాంప్రసాద్, ఎండీ మాజీత్, జాబీద్, సాజిత్, రషీద్, మోహన్, అన్వర్, అహ్మద్ ఉన్నారు. ఏసీపీ వెంట సీఐ బొల్లం రమేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కొమురుమల్లు(ఫైల్)

చిగురుమామిడి, జనవరి 18: మండలంలోని ఉల్లంపల్లి-బొమ్మనపల్లి గ్రామాల సరిహద్దులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మేడుదుల కొమురుమల్లు(52) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మేడుదుల కొమురుమల్లు అనే వ్యక్తి ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకోని తన మోపెడ్ (టీఎస్02ఎఫ్ఎచ్4894)పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో హుస్నాబాద్ నుంచి బొమ్మనపల్లి వైపు వెళ్తున్న గూడ్స్ వ్యాన్(టీఎస్ 24టిఎ1674) అతి వేగంతో మోపెడ్‌ను ఢీకొట్టింది. కింద పడిన కొమురుమల్లు తీవ్ర గాయాలతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్ మారుపాక రాజశేఖర్ నిర్లక్ష్యం, అతివేగంతో రావడం వల్లనే ప్రమాదం జరిగిందని కొమురుమల్లు భార్య కొమురవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కేజ్‌వీల్ కింద పడి బాలుడి మృతి



జీవన్(ఫైల్)

బీర్‌పూర్, జనవరి 18: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడానికి చెందిన చిక్రం జీవన్(12)అనే బాలుడు కేజ్‌వీల్ ట్రాక్టర్ కిందపడి గురువారం మృతి చెందాడు. ఏఎస్ఐ గజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీవన్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం జీవన్ సైకిల్‌పై రోడ్డువైపు వస్తున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెం దిన మెస్రం సురేందర్‌కు చెందిన (టీఎస్21ఎం4249) నంబర్ గల ట్రాక్టర్‌ను డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ పొలంలో పనులు ముగించుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో హనుమాన్ ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన జీవన్ కేజ్‌వీల్‌కు తగిలి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జీవన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 18: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 52మంది రైతులు 534క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5, 300 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 920క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

భక్తుల కోసం చలువ పందిళ్ల ఏర్పాటు



ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేస్తున్న సిబ్బంది

వేములవాడ జనవరి 18: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు చలువ పందిల్ల ఏర్పాటు ప్రారంభించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే క్రమంలో వేలాదిమంది భక్తులు ప్రతినిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. దీనికి తోడు మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఆలయ అధికారులు చలువ పందిల్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఆలయ ఈవో కార్యాలయం, ఆలయ పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పగటిపూట ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో భక్తులు ఇబ్బందులకు గురికాకుండా చూడడానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ డీఈ రఘునందన్ తెలిపారు. వచ్చే వేసవికాలం ముగిసే వరకు చలువ పందిళ్లు ఉంటాయని ఆయన వివరించారు.

● ప్రత్యేక లడ్డు కౌంటర్ల ఏర్పాటుకు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక లడ్డు కౌంటర్ల ఏర్పాటుపై రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. మహాశివరాత్రి జాతర జరిగే మూడు రోజుల పాటు భక్తులు ఆలయం పడమర వైపులోని మహిషాసుర మర్దిని ఆలయం ముందు నుంచి దక్షిణం వైపు ద్వారం నుంచి బయటకు వెళ్తుంటారు. దక్షిణ వైపు ద్వారం పక్కనే గతంలో ఆంధ్రా బ్యాంకు ఉన్న భవనంలో లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేసేవారు. ఇక్కడ లడ్డు కౌంటర్లు ఏర్పాటుపై పోలీసు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం, భక్తులు త్వరగా బయటకు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడడంతో ఆరుబయట స్థలంలో లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాజేశ్వరపురం చివరి భాగంలోని జనరేటర్ షెడ్డు సమీపంలో కొత్తగా నిర్మించిన షెడ్డులో లడ్డు కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు ఆలయ డీఈ రఘునందన్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది రామకిషన్‌రావు, నాగరాజు గురువారం ఏర్పాట్లు పరిశీలించారు.



లడ్డు కౌంటర్లు ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న అధికారులు

‘సమ్మక్క సారలమ్మ’ జాతరకు ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లాలో 50కిపైగా ప్రాంతాల్లో నిర్వహణ
- 32 చోట్ల దేవాదాయశాఖ పర్యవేక్షణలో పనులు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు



గోదావరిఖనిలో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 18: సమ్మక్క సారలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర మేడారంతో పాటు ఆయా ప్రాంతాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలు దేవాదాయశాఖతోపాటు ఆయా జాతర కమిటీలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24 వరకు జాతర కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 50కి పైగా ప్రదేశాల్లో, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 32 చోట్ల జాతర జరగనుంది. దేవాదాయశాఖ, జాతర కమిటీలు, ఇతర శాఖల అధికారుల సహకారంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అధికారులు, ఉత్సవ కమిటీల బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు దేవాదాయశాఖ అధికారులతో కలసి ఈ నెల 8, 9 తేదీల్లో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఏసీ కార్యాలయంలో ఏసీ చంద్రశేఖర్ రోజువారీ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. తాగు నీరు, వైద్యం, స్నానాలకు వాటర్ ట్యాంకులు, షవర్లు, మరుగుదొడ్లు, హెల్ప్‌డెస్క్, కంట్రోల్‌రూంలు, పార్కింగ్ స్థలాలు, పందిళ్ళు, టెంట్లు, సీసీ కెమరాలు, విఐపి, స్పెషల్, ధర్మదర్శనంకోసం బారికేడ్లు, క్యూలైన్‌లు, ఈతగాళ్ళు, శానిటేషన్, మాస్క్‌లు, సానిటైజర్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు ఆహ్వానం, ముందస్తు బడ్జెట్, టెండర్లు, వేలములు, హుండీలు, సీళ్ళు, భద్రత, సిబ్బంది, డిప్యుటేషన్ విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు ఆదేశించారు. జాతర ప్రదేశాల సమీపంలో ఉన్న కాలువలు, జలాశయాలు కూడా స్నానాలకు ఉపయుక్తం కానున్నాయి. ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడుపనుంది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు, అగ్నిమాపక శాఖలు అప్రమత్తమౌతున్నాయి. ఇప్పటికే గత 10 రోజుల నుంచి భక్తులు మొక్కులు ప్రారంభించారు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో జాతరకు బాధ్యలను నియమించారు. హుస్నాబాద్, జూపాక, మల్యాల, తనుగుల, వావిలాల ప్రాంతాలకు కె సుధాకర్ (9866440753), రేకుర్తిలో ఎ మారుతి (9441641455), చింతకుంట, కొండపల్కల, కొత్తపల్లి ప్రాంతాలకు ఎన్ అనిల్‌కుమార్ (9966881034), కేశవపట్నం, సైదాపూర్ ప్రాంతాలకు డీవీ మారుతిరావు (9490444006), వీణవంక, కేశవాపూర్, చల్లూరు, కోరుకల్, దేవంపల్లి ప్రాంతాలకు ఎన్ శ్రీనివాస్ (9290614694), వి వెంకన్న (9440026387) ఉన్నారు. ఆయా ప్రాంతాలకు అదనపు ఇన్‌చార్జిగా ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పి సత్యనారాయణ (9441641967) వ్యవహరించనున్నారు. జగిత్యాల జిల్లాలో ఒకే జాతర స్థలమైన ధర్మపురిలో డి కిరణ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో కొలనూర్, కొదురుపాక, మీర్జంపేట, హనుమంతునిపేట, పెగడపల్లి, మడక, తొగర్రాయి ప్రాంతాలకు బి సదయ్య (8523847918), నీరుకుల్ల, ఎలిగేడు, గర్రెపల్లి, తెలుకుంట ప్రాంతాలకు ఎం శంకరయ్య (9848206779), గోదావరిఖని, గుండారం, ఈసలతక్కల్లపల్లి ప్రాంతాలకు కె కాంతారెడ్డి (9963153379), గోయల్‌వాడకు కె రాజ్‌కుమార్ (9010005788) అధికారులుగా, అదనపు ఇన్‌చార్జిగా ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ ఆర్ సుజాత వ్యవహరించనున్నారు.

● 35 లక్షల మంది..

రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతరలలో సుమారు 12 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ యేడు దాదాపు 15 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకునే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మేడారంతో పాటు మిగతా ప్రాంతాలకు మరో 35 లక్షల మందికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వేలకొలదిలో మేడారం వెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్నారు. వారంతా స్థానికంగా జరిగే జాతరల వద్ద మరోమారు మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. జాతరలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్లు, ఈవోలు, మేనేజర్లు, సిబ్బంది శాఖ తరఫున సేవలందించనున్నారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు..



గతంలో జరిగిన అసౌకర్యాలు పునరావృతం కాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖలు, స్వచ్ఛందసంస్థల సహకారంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేసున్నాం. ఆయా ప్రాంతాల్లో ఇన్‌చార్జిలను నియమించాం. జాతర ప్రారంభానికి 48 గంటల ముందు నుంచే అధికారులు విధులు నిర్వహిస్తారు. అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి భక్తులు సహకరించి ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకోవాలి.

- చంద్రశేఖర్, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణ



వేములవాడ, జనవరి 18: భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణ మరోసారి నియమితుల య్యారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసి సుదీర్ఘకాలంగా రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ప్రతాప రామకృష్ణ ను తిరిగి కొనసాగి స్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణను మరోసారి నియమించడంతో జిల్లాలోని పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు శాస్త్రీయ ధృక్పథంతో ముందుకు సాగాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 18: విద్యార్థులు శాస్త్రీయ ధృక్పథంతో ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఆరు రోజులుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శీతాకాల శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామంలో విద్యార్థులతో కలిసి సామాజిక చైతన్య ప్రదర్శనను నిర్వహించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు గ్రామాల్లో మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. మూఢ నమ్మకాలతో అనేక దారుణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని శంకరయ్య అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి పర్శరాములు, ఇన్‌చార్జి హెచ్ఎం జానకి, అధ్యాపకుడు సాగర్, ఉపాధ్యాయులు రాజు, ఆంజనేయులు, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

సిరిసిల్ల రూరల్; జనవరి 18: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను, మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌లోని అర్ఎంపీ, పీఎంపీ భవనంలో గురువారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంబ జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలను తెరలేప తూ అయోధ్య రామమందిరాన్ని ముందుకు తీసుకవచ్చిందన్నారు. ఇంకా పూర్తిగా నిర్మాణం కానీ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ చేయ డం సరికాదని పీఠాధిపతులు సూచించినా కూడా బీజేపీ ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదన్నారు. బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్ప కొట్టడం లో భాగంగా ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌తో పాటు పారిశ్రామిక బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. జిల్లాలో జరిగే పారి శ్రామిక, గ్రామీణ బంద్‌లను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, గురజాల శ్రీధర్, సావనపెల్లి రాములు, కూచన శంకర్, సిరిమల్ల సత్యం, అడెపు సంపత్, రాజెల్లయ్య, పోచమల్లు, శేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి ఇల్లు కట్టించిన సర్పంచ్

ఇల్లంతకుంట, జనవరి 18: వర్షాలకు పూరిగుడిసె కూలిపోయి ఇతరుల ఇంట్లో తలదాల్చుకుంటున్నాడని తెలుసుకున్న సర్పంచ్ బాధితుడికి ఇల్లు కట్టించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పసుల కనుకయ్య నిరుపేద. కుటుంబీకులతో సహ గ్రామంలోని పూరిపాకలో ఉంటున్నాడు. వర్షాలతో పాక కూలిపోవడంతో పక్కింటి వారి ఇంట్లో ఉంటున్నాడనే విషయం తెలుసుకున్న సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ వారి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన సొంత ఖర్చులతో ఇల్లు కట్టించి ఇస్తానని సర్పంచ్ హామీ ఇచ్చాడు. అందుకు అనుగుణంగా లక్ష రూపాయలు వెచ్చించి ఇంటిని నిర్మించాడు. గురువారం కనుకయ్య గృహ ప్రవేశం చేశాడు. పారిశుధ్య కార్మికుడికి ఇంటిని నిర్మించి ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్న జితేందర్‌గౌడ్‌ను గ్రామస్థులు అభినందించారు.

దేశాయిపేటలో సీసీ కెమెరాలు ఏర్పాటు

గంభీరావుపేట, జనవరి 18: మండలంలోని దేశాయిపేట గ్రామంలో 50 వేల రూపాయలతో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్ఐ మహేష్ సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాపు, నాయకులు తోక దేవదాస్, తోక రామచంద్రం, కూడెళ్ళి శ్రీమాన్, హన్మంతరావు, లింగారావు గ్రామస్తులు ఉన్నారు.

బాల్యదశ నుంచే సైన్స్‌పై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 18: బాల్యదశ నుంచే విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్‌టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్‌లను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమాజం యొక్క అభివృద్ధి సైన్స్ పై అధారపడి ఉందన్నారు. ప్రజల్లో నెలకొన్న అంధవిశ్వాసాలను నిర్మూలించాలంటే బాల్యదశ నుంచే సైన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రం అంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 22 వతేదీన జరగబోయే చెకుముకి సైన్స్ పాఠశాల స్థాయిటాలెంట్ పరీక్షలకు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్, శైలజ, కట్కూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జనవరి 18: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి కోసం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యలయ ఆవరణలో గురువారం ప్రజలతో, అధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాటామంతీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. రుద్రంగిలోని నాగరం చెరువు మత్తడి వద్ద నీరు లీక్ అవుతుందని రైతులు చెప్పడంతో వెంటనే ఆది శ్రీనివాస్ సంబందింత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే రోడ్డుకు ఇరువైపుల మురికికాలువ ఏర్పాటు చేయాలని, బస్టాండ్, ఇందిరాచౌక్ వద్ద మూత్రశాలలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించి మురికి కాలువతో పాటు మూత్రశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రెండెకరాల ప్రభుత్వ భూమి వెంటనే కేటాయించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

వేములవాడ, జనవరి 18: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన సంఘటన వేములవాడ పట్టణంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బత్తుల చిన్న, రాజు, మధు అనే ముగ్గురు వ్యక్తులు జగిత్యాల బస్టాప్ నుంచి రాజన్న గుడి వైపు బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో స్కూటీపై ఎదురుగా శాత్రాజుపల్లికి చెందిన వ్యక్తి రావడంతో రెండు బైక్‌లు ఢీకొనగా ఇరువురు కిందపడ్డారు. దీంతో చిన్న, రాజుతో పాటు స్కూటీపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వారిని వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు ఘన నివాళి



సిరిసిల్లలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 18: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గురువారం ఘన నివాళులర్పించారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ మట్లాడుతూ ముఖ్యమంత్రిగా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మచ్చ అంజనేయులు, కార్యదర్శి ఇరుకుల్ల భాస్కర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మ్యాన వెంకటేశం, టీఎన్ఎఫ్, కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజారెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు దుమాల సత్యనారాయణ, నాయకులు బింగి వెంకటేశం, జెట్టి కొమరయ్య, గుజ్జె అశోక్, సమ్మెట రవీందర్, శ్యాగ ప్రశాంత్, మోతె బాలవ్వ, మోతె స్నేహరెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎర్రోజు కిషన్, మండలశాఖ అధ్యక్షుడు గజంబీకార్ ఎల్లోజి, నాయకులు అనుపురం చిరంజీవి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని నాయకులు కొనియాడారు. పేదల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయిన మహానుభావుడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణగౌడ్, సూర్యానాయక్, రంగారావు, మల్లారెడ్డి, దాసు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: నందమూరి తారక రామారావు 28 వర్ధంతి వేడుకలు వేములవాడలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని 13వ వార్డులో తెలుగుదేశం నాయకులు , కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వేములవాడ మండల అధ్యక్షుడు చింతలకోటి రామస్వామి గౌడ్ , కార్యదర్శి ఊర్నాల వెంకటేశం, నాయకులు దేవారెడ్డి, నర్సయ్య, లచ్చిరెడ్డి, బాషా, శంకర్, ముత్తయ్య, రవి, నగేష్, దేవయ్య, అంజయ్య, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో సినీనటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు రవి, మమత, స్వప్న, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు

సిరిసిల్ల క్రైం, జనవరి 18: మాధకద్రవ్యాల నిర్మూలనకై పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులను మూడు కేటగిరిలుగా విభజించి మాధకద్రవ్యాలనిర్మూలనకై చేపట్టాల్సిన చర్యలు, అవగాహనపై చిత్రలేఖనం (పేయింటింగ్) పోటీలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండలాలవారీగా ఎంపిక చేసి వారికి జిల్లా స్థాయిలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

పద్మశాలి ఉద్యోగుల క్యాలెండర్ అవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 18 : తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో నూతనంగా రూపోందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కరీంనగర్ జిల్లా పద్మశాలీ ఉద్యోగులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సామల పంచాక్షరి, కేంద్ర కమిటి ఉప అధ్యక్షుడు బోద్దుల గంగయ్య, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, చేనేత జౌళీశాఖ ఎడి మిట్టకోల సాగర్, బింగి చిరంజీవి, చిందం శ్రీనివాస్, అడెపు రాజేంద్రప్రసాద్, వంగ రవి, పచునూరి నవీన్, వెల్దండి సాయికృష్ణ, గుంటుక వెంకటరమణ, దూస అరవింద్, అరుణ, సబిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

ముస్తాబాద్, జనవరి 18: అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపనోత్సవాల నేపథ్యంలో ముస్తాబాద్‌లో నిర్వహిస్తున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ మెర్గు అంజాగౌడ్ పిలుపునిచ్చారు. ముస్తాబాద్‌లోని వివేకనంద కూడలిలో గురువారం మాట్లాడుతూ ఈ నెల 22వతేదీన 500 సంవత్సరాల కళ నెరవేరుతుందన్నారు. ముస్తాబాద్‌లో మంగలిగడ్డ హనుమాన్ ఆలయం నుంచి శివకేశవుల ఆలయం వరకు స్వామి వారి ఉరేగింపు ఉంటుందన్నారు. భజన సంకీర్తన, రామనామ సంకీర్తన ఉంటుందని పెద్దఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త కమిటీ, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కొండాపూర్ రాజుసెట్, గూడెపు దేవేందర్ పటేల్, వెంకటేశ్, నందం, శ్రీకాంత్, జగన్, కాలువ బాలు, జగదాంబ రాజు, రాధకృష్ణ, గోపిశెట్టి సంతోష్, బండారి సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చీకోడ్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ముస్తాబాద్, జనవరి 18: మండలంలోని చీకోడ్ గ్రామ ఎల్లమ్మ ఆలయంలో మళ్లీ చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటాక దొంగలు విజృంభించారు. సమీప పొలాల్లోని మిరపకాయలను ఎత్తుకెళ్లారు. ఎల్లమ్మ ఆలయ పరిధిలోని కిరాణకొట్టులో సామానులను ఎత్తుకెళ్లారు. వరుసగా రెండురోజులుగా దొంగలు విజృంభించడంతో గీతకార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకొని న్యాయంచేయాలని కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, జనవరి 18: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశపరీక్ష కోసం ఈనెల 20వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

సర్పంచ్‌ల పక్షాన కేటీఆర్ ఉద్యమం చేస్తాననడం సిగ్గుచేటు

- టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

సిరిసిల్ల టౌన్, జనవరి 18: గ్రామ పంచాయితీల బకాయిల డబ్బుల కోసం సర్పంచ్‌ల పక్షాన మాజీ మంత్రి కేటీఆర్ ఉద్యమం చేస్తాననడం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. గురువారం సిరిసిల్లలోని కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మృత్యుంజయం మాట్లాడారు. కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు సోయిలేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకుండా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. జిల్లాలోని పంచాయతీలకు గత రాష్ట్ర ప్రభుత్వం ఆరున్నర కోట్లు బకాయిలు ఉన్నాయని అన్నారు. మ్యాచింగ్ గ్రాంట్, ఎన్ఆర్ఈజీఎస్ కింద రావల్సినటువంటి దాదాపు రూ. 150 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిధులు రాక 45 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. సర్పంచ్‌ల ఆత్మహత్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రి కేటీఆర్ బాధ్యులని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఎంపీటీసీ బైరినేని రాము, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారయణ, నాయకులు వైద్య శివప్రసాద్, వెంకటేశం, చోటు, మంగ కిరణ్ పాల్గొన్నారు.

● ప్రభుత్వంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా?

ఎల్లారెడ్డిపేట: సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడడంతో పాటు ఆత్మహత్యలు చేసుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేటీఆర్‌కు గుర్తుకు రాలేదా..? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సర్పంచుల సమస్యల కోసం తాను గొంతుకనై పోరాడుతానని పేర్కొనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సర్పంచుల ఆత్మహత్యలకు మాజీ మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని అన్నారు. చేనేత కార్మికుల సమస్యల గురించి ఏనాడు పట్టించుకోని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి కార్మికుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సర్పంచులు, చేనేత కార్మి కుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నర్సయ్య అ న్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, సాహెబ్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, రాజునాయక్, రఫీక్, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ముస్తాబాద్: గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పుతెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచ్‌లకు బిల్లులు అందలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్‌పై బురదజల్లుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, యువజన విభాగం అధ్యక్షుడు రంజాని నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: అభివృద్ధి చాటున ఎమ్మెల్యే కేటీఆర్ దోచుకున్నాడని.. స్థానిక ఎంపీకి అభివృద్ధి అంటే ఏమిటో తెలియదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ విమర్శించారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ప్రవీణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు వాళ్ల పక్షాన పోరాడుతానని కేటీఆర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. చేసిన పనులకు బిల్లులు ఇస్తే సర్పంచ్‌లు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ బండి సంజయ్‌కు అభివృద్ధి అంటే ఏమిటో కూడా తెలియదని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నేరేళ్ల నర్సింగం, పొన్నాల పర్శారాం, మునిగెల రాజు ఉన్నారు.

కార్మికులను సంక్షేమానికి కృషి చేసిన కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల టౌన్, జనవరి 18: సిరిసిల్ల కార్మికుల సంక్షేమానికి నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్ర మకు చెందిన పెద్ద మనుషులను నాడు హైదరాబాద్‌కు పిలిపించుకొని వస్త్ర పరిశ్రమ సాధక బాధలను తెలుసుకొని కార్మికులకు ఉపాధి కల్పించాలని బతుకమ్మ చీరలను రూపొందించింది అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో కార్మికులకు న్యాయమైన కూలీ గిట్టుబాటు అయిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మీటర్ బట్టకు కూడా ప్రభుత్వం ఎలాంటి ఆర్డర్లు ఇవ్వలేదని ఆరోపించారు.

సిరిసిల్లకు న్యాయం చేయాలని పవర్‌లూం పరిశ్రమ అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో కేసీఆర్ బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్‌ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చారన్నారు. రాజీవ్ విద్యామిషన్‌కు సంబంధించిన బట్టలు కూడా సిరిసిల్ల నుండే ఉత్పత్తి చేయించారని, వీటి ద్వారా సిరిసిల్ల కార్మికులకు మెరుగైన వేతనాలు దొరకాయని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను నిలదొక్కుకునే విధంగా పని చేసిన వారితోనే వస్త్ర పరిశ్రమ నాశనం అయింద ని అనడం శోచనీయం అన్నారు. బతుకమ్మ చీరల బకాయిలను ఆనాటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వగలిగినంత వరకు ఇచ్చిందని మిగితా బకాయి లను చెల్లించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఎంపీ బండి సంజయ్ కార్మికులపై మొసలి కన్నీరు కార్చడం బాధాకరం అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, కార్మికుల గురించి నాలుగున్నర సంవత్సరాల్లో ఏఒక్కసారి కూడా మాట్లాడింది లేదన్నారు. ఇపుడు మెగాపవర్‌లూం క్లస్టర్ తీసుకొస్తామని అనడం హాస్యాస్పందంగా ఉంద న్నారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ ప్రధానకార్యదర్శి మ్యాన రవి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వంగ కరుణ

గంభీరావుపేట, జనవరి 18: గంభీరావుపేట మండల సర్వసభ్య సమావేశం గురువారం వాడీవేడిగా జరిగింది. చేసిన అభివృద్ధి పనుల బిల్లులు, మరోవైపు సమస్యలతో మండల సభ ఒక్కసారి వేడెక్కింది. గంభీరావుపేట మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీపీ వంగ కరుణాసురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మూడేళ్ల కిందట ఎగువ మానేరు కుడి కాలువలో పేరుకుపోయిన పూడికతీతకు మూడు లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని, ఆ పనుల బిల్లులు ఇంత వరకు రాలేదని కొళ్ళమద్ది సర్పంచ్ కేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. పూటికతీత పనులు బిల్లులు ఇస్తారా.. లేక మానేరు షెట్టర్లు తీసుకెళ్లమంటరా అంటూ సర్పంచ్ మండిపడ్డాడు. క్రీడాప్రాంగణం నిర్మాణాలకు సంబందించి ఇంత వరకు బిల్లులు రాలేదని, బిల్లులు చెల్లించాలని ఎంపీడీవోను పలువురు సర్పంచ్‌లు అడిగారు. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని, వచ్చే నీళ్ల శుభ్రంగా రావడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎగువ మానేరు ఆయకట్టు చివరి పంటలకు సాగు నీరు అందే పరిస్థితి లేదని, పంటలకు పూర్తిగా సాగునీరు అందే విధంగా అధికారులు చూడాలని సభ్యులు కోరారు. సామాన్య గృహాలకు కరెంటు బిల్లులు వేల రూపాయల్లో వస్తున్నాయని, అధిక బిల్లుల అంశాన్ని అధికారులు పరిశీలించి వినియోగదారుల సమస్యను తీర్చాలని సభ్యులు సభలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు దొడ్డు బియ్యం సరఫరా చేస్తున్నారని, సంబందిత అధికారుల దృష్టికి కొందరు సభ్యులు తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ వంగ కరుణ మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ హైమద్, వైస్‌ఎంపీపీ దోసల లత, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జనవరి 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, నారాయణపూర్ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధిత కుటుంబాలను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు గురువారం వేర్వేరుగా పరామర్శించారు. గుండారం సర్పంచ్ శంకర్‌నాయక్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయనను స్వగృహంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మండల కేంద్రంలో నూకల శ్రీనివాస్ తల్లి ఎల్లవ్వ అనారోగ్యంతో చనిపోగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. నారాయణపూర్‌లో ఇటీవల మృతి చెందిన యువకుడు అనుప రాజు కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు సుభాష్, పర్శరాములు, శివరామకృష్ణ, మజీద్, అనిల్, సాయి తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: మండలంలో పలువురు కుటుంబాలను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు గురువారం పరామర్శించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో వార్డు సభ్యులు రాజిరెడ్డి తండ్రి లింగారెడ్డి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని కొండూరు పరామర్శించి ఓదార్చారు. నర్మాల గ్రామంలో మాజీ సర్పంచ్ అంజయ్య తల్లి గంగవ్వ, వార్డు సభ్యులు బాల లక్ష్మి తండ్రి భూమయ్య ఇటీవల మృతి చెందారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సర్పంచ్‌లు రాజు, సత్యం, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్, యూత్ అధ్యక్షుడు రత్నాకర్, నాయకులు అంజనేయులు, శ్రీనివాస్, స్వామి, మల్లేశం, గోగు లింగమ్‌యాదవ్, ఎగదండి స్వామి, వహీద్ తదితరులు ఉన్నారు.

వస్త్ర పరిశ్రమలు మూతపడడానికి గత ప్రభుత్వమే కారణం



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 18: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలు మూతపడడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో మూడు రోజులనుంచి పాలిస్టర్ వస్త్ర పరిశ్రమలు బంద్ చేయడంతో పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు పనిలేక చాలా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న నాయకులు గురువారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని పలు పరిశ్రమలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కార్మికులకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం వలన ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పాలిస్టర్, కాటన్ మార్కెట్ మొత్తం సిరిసిల్ల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుతం మార్కెట్ లేక పాలిస్టర్ వస్త్రాలను యాజమానులు ఉత్పత్తి చేయడం లేదని అంటున్నారన్నారు. దీనికి తోడు గత ప్రభుత్వ హాయంలో రావాల్సిన బతుకమ్మచీరల బకాయి బిల్లులు, కరెంట్ అధిక చార్జీల సమస్యలు తోడయ్యాయని ఆ పరిస్థితి రావడానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. వెంటనే ప్రభుత్వ యాజమానులు పెట్టిన బంద్‌ను ఉపసంహరించుకోనే విధంగా చర్యలు తీసుకోని కార్మికులకు ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సిరిమల్ల సత్యం, అడెపు సంపత్‌తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం వల్లే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణం గత ప్రభుత్వం, మాజీ మంత్రి కేటీఆరేనని సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లను వస్త్ర సంక్షోభం నుంచి కాపాడడం కోసమని నాడు బతుకమ్మ చీరల ఉత్పత్తులు తీసుకొచ్చి అంతకు ముందు ఉత్పత్తులు అవుతున్న పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులను నిలిపివేశారని అన్నారు. బతుకమ్మ చీరలపై ఆధారపడిన పరిశ్రమకు గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బిల్లులను సక్రమంగా ఇవ్వక పోవడం వల్లే సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆరోపించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమపై సమావేశాలు ఎన్నిసార్లు ఏర్పాటు చేశారో తెలపాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకుందని, సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఏ సేవలను అందించాలో ఆలోచన చేస్తుందన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సిరిసిల్ల ఉపాధ్యక్షుడు మోర రవి, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: చేనేత పరిశ్రమ సంక్షభంలో ఉందని లేఖ రాసిన స్థానిక ఎంపీ బండి సంజయ్ చేనేత కార్మికుల సమస్యపై ఇంతకు ముందు ఎందుకు స్పందించ లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ప్రశ్నించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హమీద్ మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో ఏనాడు చేనేత కార్మికుల సమస్యపై మాట్లడని ఎంపీ సంజయ్ ఈ రోజు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చేనేత పరిశ్రమ సంక్షోభానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే కారణమన్నారు. పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ డ్రామాకు తెరలేపాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, నాయకులు ప్రభాకర్, రామచంద్రారెడ్డి, కిషన్‌గౌడ్ ఉన్నారు.